సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024


శ్రీ చైతన్య విద్యార్థుల ఆర్తనాదాలు 8లో


గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో మహిళా మనోవికాస్ 8లో


పోలీస్‌స్టేషన్‌కు గణపతి విగ్రహం 8లో

● ఓహో.. పావురమా.!



ఒక వైపు సముద్రపు అలలు.. మరోవైపు పక్షుల కిలకిలరావాలతో సాగరతీరం సందడిగా మారింది. ముఖ్యంగా సాయంత్రం వేళ బీచ్‌రోడ్డులో పావురాలు కనువిందు చేస్తున్నాయి. వందల సంఖ్యలో పావురాలు గుంపులుగా ఎగురుతూ.. సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. పక్షి ప్రేమికులు, ఫొటోగ్రాఫర్లు ఈ దృశ్యాలను కెమెరాల్లో బంధించడానికి పోటీపడుతున్నారు.

● ఓనం.. వైభవం



కేరళీయులు ఓనం పండగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళా సమితిలో జరిగిన వేడుకల్లో పూక్కళం పూజలు, సంప్రదాయ నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కేరళకు చెందిన ఎమ్మెల్యే ప్రమోద్ నారాయణ వేడుకలకు హాజరయ్యారు. 8లో

● రాళ్లు.. సెల్ఫీలు



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనాలతో ముందుకొచ్చిన సముద్రం క్రమంగా వెనక్కి వెళుతోంది. ఆదివారం సుమారు 50 అడుగుల మేర వెనక్కి వెళ్లడంతో పెద్ద పెద్ద రాళ్లు బయటపడ్డాయి. ఈ రాళ్లను చూసేందుకు సందర్శకులు ఎంతగానో ఆకర్షితులవుతున్నారు. ఆదివారం కావడంతో ఈ ప్రాంతం మొత్తం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా రాళ్లపై సెల్ఫీలు తీసుకోవడానికి యువత ఆసక్తి చూపింది. - బీచ్‌రోడ్డు

న్యూస్‌రీల్

డ్వామా పీడీగా పూర్ణిమాదేవి



మహారాణిపేట: జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఆర్.పూర్ణిమాదేవి నియమితులయ్యారు. ప్రస్తుత పీడీ ఇ.సందీప్‌ను విజయనగరం డ్వామా పీడీగా ప్రభుత్వం బదిలీ చేసింది. పూర్ణిమాదేవి డీఎల్‌డీవోగా పని చేస్తున్నారు.

డీఎల్‌డీవోగా మంగమ్మ

భీమిలి డీఎల్‌డీవోగా అలివేలు మంగమ్మ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈ స్థానంలో బి.లక్ష్మీపతి పనిచేస్తుండగా.. టెక్కలి డీఎల్‌డీవోగా పనిచేస్తున్న మంగమ్మ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు.

డీఆర్‌డీఏ పీడీగా లక్ష్మీపతి



భీమిలి డీఎల్‌డీవోగా పనిచేస్తున్న బి.లక్ష్మీపతిని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు. ప్రస్తుత పీడీ ఎం.ఎస్.శోభారాణిని సొంత శాఖ సాంఘిక సంక్షేమ శాఖకు బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పంచాయతీరాజ్ ఎస్‌ఈగా శ్రీనివాసరావు



జిల్లా పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎస్‌ఈగా శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. గత నెల 30న ఎస్‌ఈ రవీంద్ర పదవీ విరమణ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావుకు పదోన్నతి ఇచ్చి ఎస్‌ఈగా నియమించారు.

జెడ్పీ సీఈవోగా నారాయణమూర్తి



ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పి.నారాయణమూర్తిని నియమించారు. నారాయణమూర్తి కాకినాడలో డీఎల్‌డీవోగా పనిచేస్తున్నారు. విశాఖ సీఈవోగా పనిచేసిన పోలినాయుడు మంత్రి వద్ద ఓఎస్డీగా వెళ్లారు. ఇంత వరకు డిప్యూటీ సీఈవో సత్యనారాయణ ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు ఆయన్ని శ్రీకాకుళం డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు. ఇక్కడకు డిప్యూటీ సీఈవోగా డి.రాజ్‌కుమార్‌ను నియమించారు.

డీఎస్‌వోగా భాస్కరరావు

మహారాణిపేట: జిల్లా డీఎస్‌వోగా వి.భాస్కరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం డీఎస్‌వోగా ఉన్న జి.సూర్యప్రకాశరావును శ్రీకాకుళం డీఎస్‌వోగా నియమించారు. ఈ మేరకు సివిల్ సప్లయిస్ కమిషనర్ జి.వీరాపాండయన్ ఉత్తర్వులు జారీ చేశారు. భాస్కరరావు కాకినాడలో ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. అసిస్టెంట్ సప్లయిస్ ఆఫీసరుగా సి.ఆర్.కల్యాణి నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లా నుంచి విశాఖ జిల్లా ఏఎస్‌వోగా వస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ సీయూపీగా శిల్ప

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా వి.శిల్ప నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ఇప్పటి వరకు వీకేపీసీపీఐఆర్ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే ఇక్కడ సీయూపీగా ఉన్న కె.సంజయ్‌రత్నకుమార్‌ను వీకేపీసీపీఐఆర్ టౌన్‌ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

అంకుర వికాసం.. ఉపాధికి ఊతం

అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు ఎదురుచూస్తున్న యువతని చేయి పట్టి నడిపించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధం చేసిన వ్యవస్థ.. ఇప్పుడు ఫలాలందిస్తోంది. గతంలో జరిగిన చర్చలు సఫలీకృతం కావడంతో తాజాగా స్టార్టప్‌లకు అంతర్జాతీయంగా చేయూతనందించే యూఎస్ ఏజెన్సీతో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ(ఏపీఐఐఎస్) ఒప్పందం కుదుర్చుకుంది. గ్లోబల్ ఫండింగ్, వనరులు కల్పన, పెట్టుబడిదారులను సమకూర్చడమే లక్ష్యంగా అంకుర సంస్థలకు ఈ ఏజెన్సీ ఆసరాగా నిలవనుంది.

- యూఎస్ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్న ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చర్చలు సఫలీకృతం
- రాష్ట్రంలోని స్టార్టప్‌లకు సహకారం అందించనున్న స్టార్టప్ రన్ వే సంస్థ
- ఇప్పటికే రెండు స్టార్టప్‌లను ఎంపిక చేసిన యూఎస్ ఏజెన్సీ
- గ్లోబల్ ఫండింగ్, వనరులు, పెట్టుబడిదారులను సమకూర్చడమే లక్ష్యం

సాక్షి, విశాఖపట్నం : ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో అంకురిస్తున్న స్టార్టప్‌లకు కొత్త అవకాశాలను సృష్టించేందుకు యూఎస్ సొసైటీకి చెందిన స్టార్టప్ రన్ వే అనే సంస్థతో జతకట్టింది. ఐటీ రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు స్టార్టప్‌లకు చేయూతనందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్న అవకాశాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించింది. 2022-23లో పలు మార్లు యూఎస్ ఏజెన్సీతో ఏపీఐఐఎస్ ప్రతినిధులు చర్చలు జరిపారు. ప్రభుత్వ విధానాలకు సంతృప్తి చెందిన స్టార్టప్ రన్‌వే సంస్థ.. రాష్ట్రంలోని అంకుర సంస్థలకు చేయూతనందించేందుకు అంగీకారం తెలిపింది. ఈ ఏజెన్సీ ఇప్పటికే రాష్ట్రం నుంచి రెండు స్టార్టప్‌లను ఎంపిక చేసింది. విశాఖలోని ఐటీ సెజ్‌లో ఉన్న గ్లోబల్ క్లైమేట్ రిస్క్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (జీసీఆర్ఎస్), అంతర్ ఐవోటీ సంస్థలకు గ్లోబల్ చేయూతనందించే ప్రక్రియ ప్రారంభమైంది.

గ్లోబల్ ఫండింగ్‌తో స్టార్టప్‌ల వృద్ధి

మరిన్ని స్టార్టప్‌లను ఎంపిక చేసి, గ్లోబల్ ఫండింగ్ ద్వారా వనరులు సృష్టించి.. ఆ సంస్థలు విజయవంతం అయ్యేందుకు అవసరమైన సహకారాన్ని యూఎస్ ఏజెన్సీ అందజేయనుంది. కార్పొరేట్ భాగస్వాములతో స్టార్టప్ ప్రతినిధులను జతకట్టించి.. సంస్థల అభివృద్ధికి పెట్టుబడిదారులు, పరిశ్రమల నిపుణులను అందించేందుకు సహకరిస్తుంది. తద్వారా గ్లోబల్ నెట్‌వర్క్ మెరుగుపరచడంతో పాటు మార్కెట్‌ను పెంపొందించడం, నిధుల అవకాశాలను సృష్టించడం, అంతర్జాతీయ మార్కెట్‌లోకి ఆహ్వానించి.. స్టార్టప్‌లు కీలక సంస్థలుగా బలోపేతం చేసేందుకు ఏపీఐఐఎస్ దోహదపడుతుంది. ప్రస్తుతం గ్రీన్, సస్టైనబుల్ ఎనర్జీ, ఏఐ, బ్లాక్‌చెయిన్, సైబర్ సెక్యూరిటీ తదితర సాంకేతికతలపై పనిచేస్తున్న స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను ఇందులో భాగస్వామ్యం చేసేందుకు ఏపీఐఐఎస్ అన్వేషిస్తోందని సంస్థ ప్రతినిధి అనిల్‌కుమార్ తెలిపారు.

STARTUP RUNWAY

జీసీఆర్ఎస్ స్టార్టప్



పర్యావరణ సుస్థిరతకు సంబంధించిన సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన ఆవిష్కరణలతో జీసీఆర్ఎస్ స్టార్టప్ పనిచేస్తోంది. ఈ సంస్థలోని నిపుణుల బృందం ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెన్సీ, సలహా సేవలను అందించడమే కాకుండా విభిన్న సంస్థలకు సంబంధించిన ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక పరిష్కారాలు, సాంకేతికతను అభివృద్ధి చేసి అందిస్తుంటుంది. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు, విద్య, పరిశోధన సంస్థలతో ఈ స్టార్టప్ జతకట్టింది. ప్రస్తుతం ఈ సంస్థ యూఎస్ ఏజెన్సీ చేయూత పొందేందుకు ఎంపికైంది.

అంతర్ స్టార్టప్



ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, నెక్స్ట్‌జెన్ టెక్నాలజీలో ప్రత్యేకత కలిగిన స్టార్టప్ అంతర్. సురక్షితమైన, అధిక నాణ్యత, సాంకేతికంగా అధునాతనమైన స్మార్ట్ ఉత్పత్తుల శ్రేణిని అభివృద్ధి చేస్తారు. ఐవోటీ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫారమ్ ద్వారా సంస్థల కార్యాచరణ సామర్థ్యాలు మెరుగుపరిచేలా సొంత స్మార్ట్ ఉత్పత్తులు అందిస్తోంది. స్మార్ట్ మాడ్యుల్-ఎక్స్‌పీ, 2ఎక్స్ పవర్ స్మార్ట్‌హోమ్, గేట్‌వే సాఫ్ట్‌వేర్, సెన్సార్లు మొదలైన ఉత్పత్తులు కీలక సంస్థలకు అందజేస్తోంది. అంతర్ ఐవోటీ ప్లాట్‌ఫారమ్ ద్వారా రియల్‌టైమ్ డివైజ్ మానటరింగ్ మేనేజ్‌మెంట్, డేటా అనాలసిస్, యూజర్ ఫ్రెండ్లీ డాష్‌బోర్డ్, సెక్యూర్ ఇన్‌ఫ్రా తదితర సౌకర్యాలు కల్పించనుంది. ఈ సంస్థను కూడా స్టార్టప్ రన్‌వే సంస్థ ఎంపిక చేసింది.

అప్పన్న ఆస్తుల పరిరక్షణే ధ్యేయం

సింహాచలం ఈవోగా త్రినాథరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. దేవస్థానం ఈవోగా త్రినాథరావు ఆదివారం సింహగిరిపై బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం ఇన్‌చార్జిగా ఈవోగా ఉన్న దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి ఇప్పటివరకు మూడు సార్లు ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించానని, ఇప్పుడు బదిలీపై పూర్తిస్థాయి ఈవోగా రావడం సంతోషంగా ఉందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మంచి వాతావరణంలో దర్శనం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. అంతకుముందు ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ హరి, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, రాజేంద్రకుమార్, పిల్లా శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు తదితరులు ఈవోని కలిసి అభినందనలు తెలిపారు.

ఉమ్మడి విశాఖలో 16 మంది తహసీల్దార్ల బదిలీ

మహారాణిపేట : ఉమ్మడి విశాఖ జిల్లాలో 16 మంది తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ బదిలీ చేశారు. వీరిలో ఎనిమిది మందిని విశాఖ జిల్లాకు.. ఐదుగుర్ని అనకాపల్లి జిల్లాకు.. ముగ్గురు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. ఏఎస్ఆర్ జిల్లా నుంచి వచ్చిన ఎం.బి.అప్పారావును విశాఖ కలెక్టరేట్ మెజిస్టీరియల్ సెక్షన్‌కు, పి.లచ్చాపాత్రుడ్ని మహారాణిపేట తహసీల్దార్‌గా, అనకాపల్లి నుంచి వచ్చిన ఎస్.రాణిఅమ్మాజిని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ తహసీల్దార్‌గా నియమించారు. అలాగే అనకాపల్లి నుంచి వచ్చిన కె.జానకమ్మను విశాఖ జిల్లా ఆర్‌డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా, పెదగంట్యాడ తహసీల్దార్ ఎల్.రామారావును అనకాపల్లి జిల్లాకు, విశాఖ జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎ.శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఆర్‌డీవో ఏవోగా ఉన్న కె.రమాదేవిని అనకాపల్లి జిల్లాకు, ఏఎస్ఆర్ నుంచి వచ్చిన ఎస్.నాగమ్మను అనకాపల్లి జిల్లాకు, ఏఎస్ఆర్ జిల్లా నుంచి వచ్చిన ఎ.వేణుగోపాల్‌ను అనకాపల్లి జిల్లాకు, విశాఖ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న వి.శ్యామ్‌కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా నుంచి వచ్చిన కె.జయప్రకాష్‌ను అల్లూరి జిల్లాకు.. అనకాపల్లి నుంచి వచ్చిన ఎం.వి.వి. ప్రసాద్‌ను అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వచ్చిన పి.అమలను పెదగంట్యాడ తహసీల్దార్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన డి.రవిని విశాఖ కలెక్టరేట్‌లో కో-ఆర్డినేషన్ కమిటీ తహసీల్దార్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన ఎం.భుజంగరావును ములగాడ తహసీల్దార్‌గా , ములగాడ తహసీల్దార్ తారకేశ్వరిని జీవీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమించారు.

పరారైన తహసీల్దార్ హత్య కేసు నిందితుడి అరెస్టు

మధురవాడ: బెయిల్ రద్దయిన తరువాత నగరం నుంచి పరారైన తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసు నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం గంగారావు పోలీసులకు చిక్కాడు. అతడిని విజయవాడలో పీఎం పాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గంగారావు బెయిల్ రద్దయిన తర్వాత ఎటువంటి సమాచారం లేకుండా నగరాన్ని వదిలి వెళ్లిపోయాడు. దీంతో అతడిపై కోర్టు నాన్ బెయిల్ వారంట్ ఇచ్చింది. పీఎంపాలెం పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి విజయవాడలో అతడిని అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ గేదెల బాలకృష్ణ చెప్పారు.

కొత్త సబ్ రిజిస్ట్రార్లు వీరే..

విశాఖ సిటీ: జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ల బదిలీ కౌన్సెలింగ్ ముగిసింది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి 48 మంది సబ్ రిజిస్ట్రార్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ మినహా మిగిలిన వారందరూ బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించారు. ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్ మరో నాలుగు నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల మార్గదర్శకాల ప్రకారం ఆయనకు బదిలీల నుంచి మినహాయింపు లభించింది. భీమిలి సబ్‌రిజిస్ట్రార్‌గా హర్షవర్ధన్‌రెడ్డి, మధురవాడకు చక్రపాణి, పెందుర్తికి కీర్తి ప్రియ, గోపాలపట్నంకు లక్ష్మీనారాయణ, గాజువాకకు తారకేష్, పెదగంట్యాడకు రోహన్, సూపర్ బజార్ సబ్‌రిజిస్ట్రార్‌గా సంజీవయ్య నియమితులయ్యారు.

మైనింగ్ శాఖ డీఎంజీవోగా జగన్నాథరావు

ఆరిలోవ: జిల్లా మైనింగ్ శాఖ డీఎంజీవో గంజి వెంకటేశ్వర్లను అనంతపురం జిల్లా డీఎంజీవోగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఒంగోలులో డీఎంజీవోగా పనిచేస్తున్న జగన్నాథరావు నియమితులయ్యారు.

కమర్షియల్ ట్యాక్స్ జేసీగా కిరణ్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర పన్నుల శాఖ విశాఖపట్నం-1 జాయింట్ కమిషనర్‌గా వై.కిరణ్‌కుమార్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన పన్నుల శాఖ అప్పిల్లేట్ అథారిటీ జేసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. విశాఖపట్నం-1 జాయింట్ కమిషనర్‌తో పాటు విశాఖపట్నం-2 జేసీగానూ అదనపు బాధ్యతల్ని(ఎఫ్ఏసీ) కిరణ్‌కుమార్‌కు అప్పగిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్ జీవో జారీ చేశారు.

దళారులకే మేలు

- ఇసుక ఆన్‌లైన్ విధానంతో అవస్థలు
- వినియోగదారునికి నష్టం, లారీ యజమానులకు కష్టం
- జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం ప్రతినిధులు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న క్వారీ లారీ యజమానుల ప్రతినిధులు



నిరసన వ్యక్తం చేస్తున్న లారీ యజమానులు

తగరపువలస : కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఇసుక ఆన్‌లైన్ విధానంతో దళారులకు మేలు జరుగుతుండగా, వినియోగదారునికి నష్టం, లారీ యజమానులకు కష్టం మిగులుతోందని జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం ప్రతినిధులు వాపోయారు. ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ బోయపాలెం వద్ద ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రైవేట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఇసుకను ఆన్‌లైన్‌లో ఉంచినప్పుడు వినియోగదారునికి, లారీ యజమానులకు మేలు జరిగేదన్నారు. కూటమి ప్రభుత్వం ఉచితం పేరుతో ఆన్‌లైన్‌లో ఉంచిన ఇసుక కారణంగా వినియోగదారునిపై మోయలేని భారం, లారీ యజమానులకు అవమానాలు మిగులుతున్నాయన్నారు. ప్రస్తుతం అసోసియేషన్‌లో ఉన్న 600 మందికి పైగా యజమానులకు 2,500 వరకు లారీలు ఉన్నాయన్నారు. నగరంలోని వినియోగదారులు, లారీ యజమానుల కోసం రాజమండ్రి, శ్రీకాకుళంలో ఇసుక రీచ్‌లు తెరిచి ఇసుక అందుబాటులో ఉంచాలన్నారు. మన రాష్ట్రంలో ఇసుక రీచ్‌లు లేని కారణంగా ఒడిశాలోని 10 ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. గతంలో అక్కడ టన్ను ఇసుక రూ.400 ఉండగా.. మన రాష్ట్రంలో విధానాల వల్ల రూ.1200కు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఆ ఇసుకను విశాఖకు తరలించేటప్పటికి రవాణా, పర్మిట్లు, టోల్‌గేట్ల చార్జీలు కలిపి టన్ను రూ.2 వేలకు చేరుతోందన్నారు.

కోట్లు దండుకుంటున్న కూటమి నేతలు

వారం రోజుల క్రితం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నియోజకవర్గం బూర్జ మండలం నారాయణపురం పరిధిలో తెరిచిన ఇసుక రీచ్ అక్కడి నాయకులు, అధికారులకు అప్పనంగా కోట్లు కురిపిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం టన్ను ఇసుక రూ.340గా నిర్ణయించి 5 వేల టన్నులు అందుబాటులో ఉంచితే అక్కడి వారే ఆధార్ కార్డులు, డీడీల ఆధారంగా ఇసుకను బ్లాక్ చేశారని తెలిపారు. 30 ఏళ్లుగా ఇసుక రవాణాపై ఆధారపడ్డ తమకు రూ.6,800 ఇసుకను బ్లాక్‌లో రూ.25 వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తున్నారని ఆక్షేపించారు. దీనికి రవాణా చార్జీలు కలిపి నగరానికి తీసుకు వచ్చేసరికి టన్ను రూ.1800కు చేరుతోందన్నారు. దీంతో తామే వినియోగదారుడిని మోసం చేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు వెనక్కి తీసుకోవాలన్నారు. ఓవర్‌లోడు, రాంగ్ పార్కింగ్ పేరుతో పోలీసులు, మైనింగ్, విజిలెన్స్ అధికారుల దాడులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటిని రద్దు చేయకపోతే లారీలను నిలిపివేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు కొయ్య శ్రీనివాసరెడ్డి, బొట్ట సురేష్, జాయింట్ సెక్రటరీలు ఉప్పులూరి శ్రీనివాసరావు, దాసరి భాస్కరరావు సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పేరుతో దోపిడీ



కూటమి ప్రభుత్వం ఉచితం పేరుతో సరఫరా చేస్తున్న ఇసుక కారణంగా వినియోగదారుడు దోపిడీకి గురవుతున్నాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలాగే ఒక ధర నిర్ణయించి పారదర్శకంగా విక్రయాలు చేపడితే అవసరమైన ఇసుకను నచ్చిన రీచ్‌ల నుంచి తెచ్చుకోవచ్చు. నారాయణపురం రీచ్ నుంచి ఆధార్‌కార్డు, డీడీల ఆధారంగా ఇసుకను కొనుగోలు చేసిన దళారులు, బ్రోకర్లు ఇసుకను ఎక్కడ అన్‌లోడ్ చేశారో విచారిస్తే లోపాలు అర్థమవుతాయి.

– మద్దిల వెంకటరమణ, అసోసియేషన్ అధ్యక్షుడు

ఇసుక పాలసీని మార్చాలి



కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీ విధానాన్ని మార్చాలి. దళారులు బ్లాక్‌లో విక్రయాలు చేస్తున్నారు. మేం వారి నుంచి అధిక ధరలకు కొనుగోలు చేస్తుంటే వినియోగదారులు మాపై ఆరోపణలు చేస్తున్నారు. శ్రీకాకుళం, రాజమండ్రిలో రీచ్‌లు తెరిచి, మధ్యవర్తులు లేకుండా గత ప్రభుత్వంలా ధరలను సరళతరం చేయాలి.

– కర్రి వెంకటరమణ, కార్యదర్శి

వినియోగదారుడికి స్వేచ్ఛ ఉండాలి..



లభ్యమయ్యే మూడు రకాల ఇసుకలో వినియోగదారునికి స్వేచ్ఛ ఉండాలి. తక్కువ మోతాదులో కొనుక్కునే వారికి వెసులుబాటు కల్పించాలి. నిరక్షరాస్యులు కూడా కొనుగోలు చేసే విధంగా ఆన్‌లైన్‌లో మార్పులు జరపాలి. రవాణాదారులపై వేధింపులు ఆపాలి.

– నమ్మి మాధవరావు, కోశాధికారి

అపరాధ రుసుం, గ్రీన్‌టాక్స్ రద్దు చేయాలి



ఓవర్ లోడ్ పేరుతో లారీ యజమానులపై విధించే రూ.20వేల అపరాధ రుసుం, గ్రీన్ టాక్స్‌లను ప్రభుత్వం రద్దు చేయాలి. రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు అయిన ఖర్చులు ఆధారంగా టన్ను ఇసుక ధర నిర్ణయించాలి.

– మద్దిల శ్రీనివాసరావు, కన్వీనర్

క్లుప్తంగా

విశాఖ డెయిరీ నెయ్యి కొనుగోలుకు చర్యలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో లడ్డూల తయారీ, దీపారాధన, ఇతర అవసరాలకు విశాఖ డెయిరీ నెయ్యి కొనుగోలుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. దేవస్థానంలోని సెంట్రల్ స్టోర్స్‌లో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసి, అప్పటికి స్టాక్ ఉన్న నెయ్యిని సీజ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆదివారం లడ్డూల తయారీని నిలిపివేశారు. ఆదివారం నాటికి 71 వేల లడ్డూల స్టాక్ ఉండటంతో వాటిని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 25 వేల నుంచి 30 వేల లడ్డూలు అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా విశాఖ డెయిరీ నెయ్యిని కొనుగోలు చేసేందుకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేయడంతో, దేవస్థానం అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం 15 కిలోల చొప్పున వంద టిన్ల విశాఖ డెయిరీ నెయ్యి దేవస్థానానికి రానుంది. దీంతో సోమవారం నుంచి తిరిగి లడ్డూలను తయారు చేయనున్నారు.

'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్'లో మహిళా మనోవికాస్

ఎంవీపీకాలనీ: నగరానికి చెందిన మహిళా మనోవికాస్ సంస్థకు గిన్నిస్ బుక్స్‌లో స్థానం లభించింది. 450 మంది చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులతో కలిసి ఆ సంస్థ అతి తక్కువ సమయంలో 58,112 క్రోంచెట్ స్క్వేర్స్ (మహిళలు ధరించే నూలు వస్త్రం) తయారు చేసినందుకు గాను సంస్థ ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఆదివారం వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థ (లండన్) ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ మహిళా మనోవికాస్ సంస్థ వ్యవస్థాపకురాలు మాధవి సూరిభట్లకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాధవి మాట్లాడుతూ గిన్నిస్ రికార్డు కోసం 20 వేల క్రోంచెట్ స్క్వేర్స్ తయారు చేయాల్సి ఉండగా సంస్థ ఆధ్వర్యంలో 58,112 తయారు చేసి భారీ రికార్డును సొంతం చేసుకున్నట్లు తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా 450 మంది మహిళలు ఈ రికార్డు నెలకొల్పడంలో భాగమయ్యారన్నారు. కార్యక్రమంలో ఇంటెక్ విశాఖ మాజీ కన్వీనర్ మయక్ కుమారి డియో, క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సెక్రటరీ డాక్టర్ రేణుక రాణి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.115
స్కిన్	: రూ.200
స్కిన్‌లెస్	: రూ.210

ఓనం.. వైభవం

- వేడుకగా కేరళ సంప్రదాయ ఉత్సవం
- ప్రత్యేక ఆకర్షణగా పూక్కళం, సద్య
- ఆశీస్సులు అందించిన 'బలి చక్రవర్తి'





కేరళీయుల సంరక్షకుడు బలి చక్రవర్తికి ఆహ్వానం పలుకుతున్న మహిళలు



కేరళ సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన నందినీ మీనన్‌ను సత్కరిస్తున్న సమితి సభ్యులు

మురళీనగర్: నగరంలో నివసిస్తున్న కేరళీయులు తమ సంప్రదాయ ఓనం ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. నమో కేరళీయం అంటూ తమ ఆచార వ్యవహారాలకు అనుగుణంగా కుల, మత బేధాలతో సంబంధం లేకుండా ఓనం జరుపుకున్నారు. బిర్లా కూడలి సమీపంలోని కేరళ కళా సమితిలో ఈ ఉత్సవాలు జరిగాయి. ఎక్కడ ఉన్నా తమ సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగిస్తామని, మాతృభాష మలయాళంనకు ప్రాధాన్యమిస్తామని చాటిచెప్పారు. కేరళ కళాసమితిని అందంగా ముస్తాబు చేసి ఓనంకు ఆహ్వానం పలికారు.

పూక్కళం వద్ద పూజలు

ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్ద ధాన్యపు రాసులు, కొబ్బరిపువ్వు, దీపపు కుందెలు ఏర్పాటు చేశారు. వీటి దిగువన పూల తివాచీ పూక్కళంను అమర్చారు. మహిళలు తమ సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. 10.30 గంటలకు 'బలి చక్రవర్తి' ఉత్సవ ప్రాంగణానికి విచ్చేయగా మహిళలు ఆయనకు ఎదురెళ్లి పూలతో స్వాగతం పలికారు. ఆయన రాక సందర్భంగా కేరళ సంప్రదాయ వాద్య పరికరాతో సందడి చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని బలిచక్రవర్తి ఆశీర్వదించారు.

పలువురికి ఘన సత్కారం

కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాహిత్య అకాడమీ బహుమతికి ఎంపికైన నందినీమీనన్‌ను కేరళ ఎమ్మెల్యే చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ట్రావలాగ్ ఆమ్‌చో బస్తార్ అనే రచనకు ఈ పురస్కారం లభించింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న సతీష్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలు వీక్షకులను అలరించాయి. చిత్ర గీతాలు వీనులవిందుగా సాగాయి. వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా 29 రకాల వంటకాలతో తయారు చేసిన 'సద్య'ను విందు భోజనంగా అందించారు. నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన 2 వేల మంది కేరళీయులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

సామాజిక సేవలో కేరళీయుల ముందంజ

వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కేరళ ఎమ్మెల్యే ప్రమోద్ నారాయణ మాట్లాడుతూ కేరళీయులు ఎక్కడ ఉన్నా సామాజిక సేవల్లో ముందంజలో ఉంటారని చెప్పారు. కేరళ ప్రజలు తమ మూలాలను మర్చిపోకుండా సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం అందరికీ ఆదర్శనీయమన్నారు. నగరంలోని తెలుగు ప్రజలతో మమేకమై ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, నేవల్ డాక్‌యార్డ్ అడ్మిర్ సూపరింటెండెంట్ అడ్మిరల్ విజయశేఖర్, ఎన్‌ఎస్టీఎల్ అవుట్ స్టాండింగ్ సైంటిస్ట్ డాక్టర్ అబ్రహం వర్గీస్, ట్రాయ్ పూర్వ సభ్యురాలు డాక్టర్ విజయలక్ష్మి కె.గుప్తా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన కేరళ విద్యార్థులకు అతిథులు చేతుల మీదుగా నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కేరళ కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఏఆర్‌జీ ఉన్నిథన్, కెప్టెన్ లైలా గణేస్, కోశాధికారి నురేష్, ఆలిండియా మలయాళీ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు ఎస్ఎం పిళ్లై, కైరోళి ఆర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు బిజు పీఎస్, సైమన్ తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తుల్లో ఓనంకు ఆహ్వానం పలుకుతున్న మహిళలు

ఎస్ఐ, కానిస్టేబుల్‌పై రౌడీషీటర్ దాడి

అల్లిపురం: వన్‌టౌన్ ఎస్ఐ, కానిస్టేబుల్‌పై రౌడీషీటర్ దాడి చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. టూటౌన్ పరిధి గంజిపేటలో నివసిస్తున్న రౌడీషీటర్ ఈర్ల విజయకుమార్‌పై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌బీడబ్ల్యూ వారెంట్ ఉండటంతో అతన్ని అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం అతన్ని శనివారం రాత్రి కానిస్టేబుళ్లు కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఈర్ల విజయకుమార్ వాహనం అద్దాలు విరగొట్టడంతో అడ్డుకున్న కానిస్టేబుల్ చేతిని కరిచాడు. అడ్డుకున్న ఎస్ఐని కూడా కరవటంతో ఆయన కూడా గాయపడ్డారు. ఈ మేరకు ఈర్ల విజకుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆరిలోవ పోలీసులపై దాడి?

ఆరిలోవ: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ స్థలం వ్యవహారంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఆరిలోవ పోలీసులపై దాడి జరిగినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. జీవీఎంసీ 13వ వార్డు పరిధి దీన్‌దయాల్‌లో ఓ స్థలం వ్యవహారంలో నలుగురు అన్నదమ్ముల మధ్య ఆదివారం గొడవ జరిగింది. అది కుటుంబ తగాదా కావడంతో స్థానికులు పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా.. ఆదివారం మధ్యాహ్నం ఎర్నిదుర్గమాంబ ఆలయ ఆవరణలో అర్చక సంఘం నిర్వహించిన యాగంలో సీపీ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు. గొడవకు దిగిన ఓ వర్గానికి చెందిన వారు ఆయన వచ్చిన విషయం తెలుసుకుని ఆలయం వద్దకు చేరుకున్నారు. రెండో వర్గం తమను కొట్టినట్లు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని స్థానిక పోలీసులకు సీపీ ఆదేశించారు. దీంతో ఎస్ఐ కృష్ణ, మరో ఇద్దరు కానిస్టేబుళ్లు వివాదాస్పద స్థలం వద్దకు చేరుకున్నారు. అన్నదమ్ములను స్టేషన్‌కు తరలించి విచారించారు. కాగా.. స్థలం వద్ద పోలీసులతో ఓ రౌడీషీటర్ గొడవకు దిగినట్లు తెలిసింది. సివిల్ గొడవకు మీరెందుకు వచ్చారంటూ ఆ రౌడీషీటర్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించి.. దాడికి దిగినట్లు సమాచారం. అయితే తమపై ఎలాంటి దాడి జరగలేదని పోలీసులు తెలిపారు

పోలీస్‌స్టేషన్‌కు గణపతి విగ్రహం

- దాదాపు రెండు గంటల పాటు స్టేషన్‌లోనే నిరీక్షణ
- పోలీసులతో కమిటీ సభ్యుల వాగ్వాదం

డాబాగార్డెన్స్: పోలీసుల అత్యుత్సాహంతో వినాయకుడు దాదాపు రెండు గంటల పాటు పోలీస్‌స్టేషన్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకుని నిమజ్జన ఊరేగింపులో పోలీసులు గణేశుడి విగ్రహాన్ని స్టేషన్‌కు తరలించిన ఘటన వివాదాస్పదంగా మారింది. శనివారం రాత్రి కంచరపాలెం కప్పరాడ ప్రాంతానికి చెందిన కమిటీ సభ్యులు గణపతిని నిమజ్జనం చేసేందుకు పెదవాల్తేరు జాలారిపేట బీచ్‌కు ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. అర్ధరాత్రి దాటిపోవడంతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఓ కానిస్టేబుల్ ఊరేగింపును అడ్డుకున్నారు. డీజే కాకుండా సౌండ్ బాక్స్‌లను ఉపయోగించినప్పటికీ విగ్రహాన్ని వాహనంతో సహా పోలీస్‌స్టేషన్‌లోకి తరలించారు. ఈ చర్యకు నిరసనగా కమిటీ సభ్యులు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. తమను అడ్డుకున్న కారణాలను ప్రశ్నించగా పోలీసుల నుంచి తగిన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తర్వాత వస్తున్న విగ్రహాలను కూడా స్టేషన్‌లో పెట్టాలంటూ సభ్యులు రోడ్డుపై బైఠాయించారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఊరేగింపులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, కమిటీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇలా దాదాపు రెండు గంటల పాటు పోలీస్‌స్టేషన్‌లోనే గణపతి బప్పా నిరీక్షించాల్సి వచ్చింది. అర్ధరాత్రి రెండు గంటల తర్వాత విగ్రహాన్ని విడిచిపెట్టడంతో కమిటీ సభ్యులు సముద్రంలో నిమజ్జనం చేశారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ఆర్తనాదాలు

- ఇబ్బందులు పడుతున్నామని చీటీలు బయటకు వేసిన విద్యార్థులు
- ఖైదీలు వలే బంధించారని.. తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆవేదన
- విచారణ చేపట్టిన పోలీసులు



తమ సమస్యలు తెలుపుతూ విద్యార్థులు రాసిన చీటీలు



హాస్టల్ భవనం నుంచి బయటకు చేతులు పెట్టి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

మధురవాడ: మారికవలసలోని శ్రీ చైతన్య విద్యార్థులు వినూత్న రీతిలో ఆదివారం మధ్యాహ్నం నిరసన వ్యక్తం చేశారు. దీంతో సాయంత్రం పీఎంపాలెం పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇక్కడ కళాశాల హాస్టల్లో ఉంటున్న విద్యార్థులు తమకు కనీస సదుపాయాలు లేవని, యాజమాన్యానికి చెప్పినా పట్టించుకోలేదంటూ చేతులు బయటకు పెట్టి నినదిస్తూ చీటీలు రాసి విసిరారు. స్థానికులు గమనించి మీడియాకి సమాచారం ఇచ్చారు. తమను ఖైదీల వలే బంధించారని.. ప్రభుత్వ సెలవులను వర్తింపజేయడం లేదని.. తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని.. భోజనంలో పురుగులు ఉంటున్నాయని.. మంచాలు నిండా నల్లులు ఉన్నాయని, తాగడానికి శుభ్రమైన నీరు ఉండడం లేదంటూ చీటీల్లో రాశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పీఎంపాలెం సీఐ బాలకృష్ణ, ఎస్ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్యానికి గురైతే ఆర్ఎంపీతోనే వైద్యం చేయిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. తమ వద్ద లక్షల్లో ఫీజులు వసూలు చేసి నాణ్యమైన చదువు చెప్పడం లేదని, ఒక తరగతి గదిలో 75 మందిని ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై యాజమాన్య ప్రతినిధులు స్పందిస్తూ ఇకపై ఇటువంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని పోలీసులకు తెలిపారు.

గండి బాబ్జీ వేధింపుల నుంచి కాపాడండి

- ఎమ్మెల్యే బండారు అనుచరుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయిస్తామని బెదిరింపు
- వేధింపులు ఆపకపోతే టీడీపీకి మూకుమ్మడి రాజీనామాలు చేస్తాం
- చింతగట్ల టీడీపీ నాయకుల ఆందోళన



గండి వేధింపులపై మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు రోడ్డు మీదకు వచ్చాయి. టీడీపీ నగర అధ్యక్షుడు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీపై అదే పార్టీకి చెందిన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వర్గీయులు తీవ్ర ఆరోపణలు చేశారు. పెందుర్తి మండలం చింతగట్లలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ ముఖ్య నాయకులు ఉప్పిలి చిన్నారావు, దాసరి రమణ, చీపురపల్లి నర్సింగరావు, నందవరపు సన్యాసిరావు తదితరులు గండి బాబ్జీపై ధ్వజమెత్తారు. వారు మాట్లాడుతూ బండారు సత్యనారాయణమూర్తి మాడుగుల వెళ్లిపోవడంతో గండి బాబ్జీ తమపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సొంత పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తు వేధిస్తున్నారన్నారు. బండారు వర్గీయుడైన దమ్ము రమేష్ అనే కార్యకర్తపై రౌడీషీట్ పెడతామని బాబ్జీ హెచ్చరిస్తున్నారన్నారు. తమ ప్రత్యర్థులకు గండి బాబ్జీ వత్తాసు పలుకుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ఫిర్యాదులు చేస్తామని.. వారు స్పందించకపోతే పార్టీకి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ పెద్దలను ఒకటి రెండు రోజుల్లో కలిసేందుకు వెళుతున్నామని పేర్కొన్నారు.

కెమిక డ్రగ్స్ పరిశ్రమలో ప్రమాదం

కాంట్రాక్ట్ కార్మికుడికి తీవ్ర గాయాలు

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలో కెమిక డ్రగ్స్ పరిశ్రమలో శనివారం జరిగిన ప్రమాదంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు షవల్ షేక్(21) తీవ్రంగా గాయపడ్డాడు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివీ.. పరిశ్రమలోని ఓ షెడ్డుకు రేకులు అమర్చడానికి కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికులను నియమించుకున్నారు. శనివారం షెడ్డుపై 20 అడుగుల ఎత్తులో షవల్ షేక్ పని చేస్తున్నాడు. షెడ్డుపై ఒక దగ్గర నుంచి వేరొక ప్రదేశానికి షిఫ్ట్ అవుతున్న క్రమంలో సేఫ్టీ బెల్ట్‌కు లింక్ తగిలిస్తుండగా.. అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. తోటి కార్మికులు ప్రమాదాన్ని గుర్తించి యాజమాన్యానికి సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. వైద్య నిపుణులు అతనికి శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తు తం అతని పరిస్థితి విషమంగా ఉంది. యాజమాన్యం ఫిర్యాదుతో కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు చెప్పారు. ప్రమాదంపై విచారణ జరిపి.. షేక్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

చైతన్య కాలేజీ విద్యార్థి మృతిపై విచారణ

మధురవాడ: కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లమో చదువుతున్న జ్యోతి ప్రకాష్(16) ఆత్మహత్య ఘటనపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. ఈ కళాశాలలో గతంలో కూడా ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కంచరపాలెం ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ కె.వి.రమణ సారథ్యంలో పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ తదితరులతో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సోమవారం కళాశాలలో విచారణ చేపట్టనుంది. విద్యార్థులంతా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కమిటీ ఆదేశించింది.

ఘనంగా లండన్ ఐవీఎఫ్ సెంటర్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజల్వన చేస్తున్న ఐవీఎఫ్ సెంటర్ ఎండీ డాక్టర్ చంద్రారెడ్డి

మహారాణిపేట: ప్రారంభించిన అనతికాలంలోనే సంతానోత్పత్తి సంరక్షణ నిర్వహణలో మంచి పేరు ప్రఖ్యాతలు పొందిన ఐవీఎఫ్ సెంటర్ విశేష గుర్తింపు పొందింది. లండన్ ఐవీఎఫ్ సెంటర్ 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఐవీఎఫ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రా రెడ్డి, డాక్టర్ ఆనన్యతోపాటు.. ఐవీఎఫ్ సెంటర్ అందించిన చికిత్సలు ద్వారా సంతానం పొందిన తల్లితండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బేబీ ఫ్యాషన్ షో నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ ఐవీఎఫ్ చికిత్సలకు సంబంధించిన అపోహలు అనుమానాలను నివృత్తి చేశారు. అలాగే ఐవీఎఫ్ చికిత్స చాలా ఖర్చుతో కూడిన పని అని, ఈ చికిత్స ద్వారా పుట్టిన పిల్లలు సక్రమంగా ఉండరనే అంశాలను తోసిపుచ్చారు. విశాఖలో ప్రారంభించిన తమ సేవలను విజయనగరం, రాజమండ్రి, కాకినాడ, పాయకరావుపేట ప్రాంతాలకు విస్తరించామన్నారు. అనంతరం ఐవీఎఫ్ క్రానికల్ త్రైమాసిన మ్యాగజైన్‌ను డాక్టర్ అనన్య, డాక్టర్ టీఆర్ ధనలత ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు మాధవి లత, ఎస్. భూలక్ష్మి, జి. తనూజ, మహలక్ష్మి, స్నేహలత పాల్గొన్నారు.

వాహనాలు దొంగిలిస్తున్న ముఠా అరెస్ట్

- 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్, ఒకరు పరారీ



వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ మోహనరావు

ఎంవీపీకాలనీ: నగరంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనానికి పాల్పడుతున్న ముఠాను ద్వారకా క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో క్రైమ్ ఏడీసీపీ మోహనరావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. జనవరి 26న గుడ్లవానిపాలెంలో తన ద్విచక్రవాహనం దొంగతనానికి గురైనట్లు దుంప మనోజ్‌కుమార్ (24) ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన ద్వారకా క్రైమ్ పోలీసులు ఎట్టకేలకు నిందితులను పట్టుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నలుగురు సభ్యులు గల ముఠా ఈ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ ముఠాకు చెందిన పి.లీలా దుర్గాప్రసాద్, (22), కె.ఎస్.సూర్య(19), షేక్ ముస్తాఫా (22)లను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు హరీష్ పరారీలో ఉన్నట్లు ఏడీసీపీ వెల్లడించారు. ఈ ముఠా నుంచి మనోజ్ వాహనంతోపాటు ఆరిలోవ, ఎంవీపీ కాలనీ, ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో తొమ్మిది ద్విచక్ర వాహనాలను రికవరీ చేసినట్లు తెలిపారు.

'నాగి' గ్యాస్ట్రో ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం



అధునాతన వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ఎండీ మోహన్ వంశీ

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ప్రజలకు ఉత్తమ వైద్య సేవలందించాలనే లక్ష్యంతో నార్త్ ఆంధ్రా గ్యాస్ట్రో ఇన్‌స్టిట్యూట్(నాగి) ఆదివారం జిల్లా పరిషత్ జంక్షన్ కృష్ణ మందిరం వద్ద ప్రారంభమైంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌ను ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వ్యవస్థాపక చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన శిష్యుడు, నాగి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టి.మోహన్ వంశీ విశాఖలో గ్యాస్ట్రో ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ అధునాతన యంత్రాలతో మెరుగైన వైద్యం అందిస్తారని, విశాఖ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్ మోహన్ వంశీ మాట్లాడుతూ క్షణం తీరిక లేకుండా బిజీగా ఉండే డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తమ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి రావడం ఆనందంగా ఉందన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య సేవలకు సంబంధించిన అన్ని రకాల ఆధునిక పరికరాలు, డయాగ్నోస్టిక్, థెరపిటిక్, ఎండోస్కోపి, కోలోనోస్కోపి, పీడియాట్రిక్ ఎండోస్కోపి తదితర పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. జీర్ణకోశ సంబంధిత అన్ని రకాల వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ పెద వీర్రాజు, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

అదరగొట్టిన రికీబుయ్

- నిరాశపరిచిన నితీష్
- ముగిసిన దులీప్ ట్రోఫీ



విశాఖ స్పోర్ట్స్: దులీప్ ట్రోఫీలో విశాఖ కుర్రాడు రికీ బుయ్ అద్భుత ప్రదర్శన కనబర్చగా, నితీష్‌కుమార్ మాత్రం నిరాశపరిచాడు. కీపర్ భరత్ ఆశించిన స్థాయిలో రాణించలేదు. ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో రికీబుయ్ అజేయ శతకంతో ఇండియా డీ జట్టుకు విజయం అందించాడు. దులీప్ ట్రోఫీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్. ఈ టోర్నీలో విశాఖ నుంచి రికీబుయ్, కె.ఎస్.భరత్ ఇండియా డీ జట్టుకు, నితీష్‌కుమార్ రెడ్డి ఇండియా బి జట్టుకు ఆడారు.

రికీబుయ్ రాణింపు

అనంతపురం వేదికగా ఆదివారం జరిగిన దులీప్ ట్రోఫీ చివరి రౌండ్ మ్యాచ్‌లో ఇండియా డీ జట్టు తరపున బ్యాటింగ్‌కు దిగిన రికీబుయ్ 119 పరుగులతో అజేయంగా నిలిచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. 14 ఫోర్లు, 3 సిక్సర్లతో జట్టును విజయం వైపు నడిపించాడు. ఇండియా డీ జట్టు ఇండియా బీ జట్టుపై 257 పరుగుల భారీ తేడాతో విజయం సాధించడంలో రికీబుయ్ కీలక పాత్ర పోషించాడు. ట్రోఫీ రెండో మ్యాచ్‌లో రికీబుయ్ 14 ఫోర్లు, 3 సిక్సర్లతో 113 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

నితీష్‌కుమార్ నిరాశ

జింబాబ్వే పర్యటనకు ఎంపికైన ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ స్పోర్ట్స్ హెర్నియా కారణంగా అవకాశం కోల్పోయాడు. అయితే కొత్త దేశీయ సీజన్‌కు ముందు ఫిట్‌నెస్ సాధించినా.. దేశవాళీ క్రికెట్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. దులీప్ ట్రోఫీలో ఐదు ఇన్నింగ్స్(మూడు మ్యాచ్‌లు)లు ఆడి కేవలం 61 పరుగులు మాత్రమే చేశాడు. రెండుసార్లు డకౌట్‌గా వెనుదిరిగి జట్టుకు నిరాశ పరిచాడు. బౌలింగ్‌లో కూడా రెండు వికెట్లు మాత్రమే తీయగలిగాడు. చివరి ఇన్నింగ్స్‌లో 40 పరుగులతో నిలవడం కాస్త ఊరటనిచ్చింది.

భరత్ అర్ధ శతకం

భరత్ ఈ టోర్నీలో తొలి మ్యాచ్‌లో కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 13, రెండో ఇన్నింగ్స్‌లో 16 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో మూడు క్యాచ్‌లు, రెండో ఇన్నింగ్స్‌లో ఒక క్యాచ్ అందుకున్నాడు. అయితే రెండో మ్యాచ్‌లో భరత్ స్థానంలో శ్యాంసన్‌ను కీపర్‌గా తీసుకోవడంతో బెంచ్‌కే పరిమితమయ్యాడు. మూడో మ్యాచ్‌లో బ్యాటర్‌గా భరత్ దిగి తొలి ఇన్నింగ్స్‌లో 52 పరుగులతో రాణించినా.. రెండో ఇన్నింగ్స్‌లో రెండు పరుగులకే పెవిలియన్‌కు చేరాడు.